క్లుప్తంగా

ఏడీ బాధ్యతల స్వీకరణ


సుభానిబాషా

రుద్రవరం: స్థానిక పశు వైద్యశాల ఏడీగా సుభాని బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఏడీగా విధులు నిర్వహించిన గిడ్డయ్య కర్నూలు జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉన్నతాధికారులు కర్నూలులో పని చేస్తున్న సుభాని బాషాను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

జాయింట్ ఎల్‌పీలను వేరు చేయండి

దొర్నిపాడు: ప్రస్తుతం భూ రీసర్వే అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీ నంబర్లను వెంటనే వేరు చేయాలని తహసీల్దార్ సుభద్ర గ్రామ సర్వేయర్లకు సూచించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జాయింట్ ఎల్‌పీఎంలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు సమాచారం ఇచ్చి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, మండల సర్వేయర్ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీలినాలుక వ్యాధితో అప్రమత్తం

దొర్నిపాడు: గొర్రెలకు నీలినాలుక వ్యాధి వచ్చే అవకాశం ఉందని, గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య సూచించారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలకు నాలుక నీలి రంగులో మారి చెక్కిళ్లలో పుండ్లు అవుతాయన్నారు. అలాగే సొంగ కారుందని ఈ వ్యాధిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా గొర్రెల ప్రాణానిక ప్రమాదమన్నారు. నివారణకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. పశువైద్యశాలల్లో ఉచితంగా టీకాలు వేస్తున్నారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి చిన్నబాబు పాల్గొన్నారు.

శ్రీశైలం ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) శ్రీశైలంలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సులు ఫిట్టర్, టర్నర్, మెకానిక్ మోటార్ వెహికల్, ఎలక్ట్రిషియన్ కోర్సులు, ఏడాది కోర్సులు మెకానికల్ డీజిల్, వెల్డర్‌లలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www.iti.ap.gov.in లో సంప్రదించాలన్నారు. లేదా 9703395091, 9441181072, 9908993910 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి హైదరాబాద్ వాస్తవ్యులు పిట్టల రజనీష్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి సమక్షంలో అర్చకులకు నగదు అందజేశారు. ఆదే విధంగా హైదరాబాద్ వాస్తవ్యులు పిట్టల కిశోర్‌కుమార్, లక్ష్మీ అన్నదానం కోసం రూ.10,116 అందజేశారు. దాతలను ఆలయ సంప్రదాయ ప్రకారం అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

దత్తాత్రేయుడికి విశేష పూజలు


పూజలందుకున్న స్వామివారు

శ్రీశైలం టెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామివారికి గురువారం దేవస్థానం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజను జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు పూర్తి చేశారు.

భక్తులు లేక మహానంది వెలవెల


బోసిపోయిన మహానంది చిన్న కోనేరు

మహానంది: వేసవి సెలవులు ముగియడంతో మహానంది ఆలయ ప్రాంగణాలు భక్తులు లేక వెలవెలబోతున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. వచ్చిన కొద్దిపాటి మంది భక్తులు కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించకున్నారు.

నమో నారసింహా!


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కోనేరు


దొర్ని నరసింహ స్వామి నాటి ఆలయం


నేడు కళకళలాడుతున్న ఆలయం

- దొర్వి లక్ష్మీనరసింహస్వామికి పూర్వ వైభవం
- దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి
- ఆహ్లాదకరమైన వాతావరణం
- పెరిగిన భక్తుల సంఖ్య

రుద్రవరం: దొర్వి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం అంటేనే ఒకప్పుడు ఎంతో ఆదరరణ ఉండేది. దాదాపు 14వ శతాబ్దంలో ఏర్పడిందని పెద్దలు చెబుతున్నారు. ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, పక్కనే నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతో భక్తుల రాకపోకలతో విరాజిల్లేది. చుట్టుపక్కల ఎక్కడ వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు వసతులు లేక అన్ని సామాజిక వర్గాల వారు అక్కడికే వెళ్లేవారు. ఇలా నిత్యం శుభ కార్యాలు, పూజా కార్యక్రమాలతో ఆలయం కళకళలాడేది. అలాగే సహజసిద్ధమైన దొర్వి బుగ్గ(నీటి పారకం)తో నిరంతరం నీరు పారుతూ ఉన్న కోనేరు ప్రత్యేక ఆకర్శణగా ఉండేది. కాలక్రమేణ గ్రామాల్లో పాడుబడిన ఆలయాలు ముస్తాబు కావడంతో భక్తులంతా అక్కడికే వెళ్లేవారు. దీంతో దొర్వి నరసింహస్వామి ఆలయానికి ఆదరణ కొరవడింది. పట్టించుకోక స్వామి అమ్మవార్లకు ధూపదీప నైవేద్యాలు లేక ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. స్వామి వారి ఆలయానికి ఉన్న మాన్యం భూములను కొందరు స్వార్థపరులు డీకేటి భూములుగా చూపించి అప్పటి తహసీల్దార్లతో పట్టాలు పుచ్చుకున్నారు. అటు కొలు ఆదాయం లేక.. ఇటు భక్తులు రాక స్వామిఅమ్మవార్ల ఆలయం దీనస్థితికి చేరుకుంది. ఇదంతా ఒకప్పటి పరిస్థితి అయితే.. ప్రస్తుతం ఆలయ దీనస్థితిని గుర్తించిన కొందరు భక్తులు ఒక్కటిగా నిలిచారు. తమ సొంత నిధులతో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ముళ్ల పొదలు, పుట్టలు, గుట్టలను యంత్రాలతో తొలగించారు. గ్రామ పెద్దలు, వేద పండితుల సహకారంతో జీర్ణోద్ధరణ పనులను ప్రారంభించారు. అక్కడ అభివృద్ధి పనులు సాగుతున్న సమాచారం చుట్టుపక్కల గ్రామాలకు పాకింది. దాతలు ముందుకు వచ్చి స్వామి అమ్మవార్ల నిత్య సేవకులకు తోడుగా నిలిచారు. దాదాపు రూ.40 లక్షలతో అక్కడ అభివృద్ధి పనులు వేగవంతగా సాగాయి. అందంగా, ఆకర్షణగా ఆలయం నిర్మాణం, ప్రత్యేక ఆకర్శణగా కోనేరు, ఆలయం చుట్టూ ప్రహరీపై దేవతా మూర్తుల ప్రతిమలు, విశాలమైన ప్రాంగణం వంటి వసతులతో ఆలయ రూపురేఖలే మారిపోయాయి. ఆలయ అంతర్భాగంలో స్వామి అమ్మవార్ల మూల విరాట్ విగ్రహాలు, ఎదురుగా ధ్వజ ప్రతిష్ట వంటివి గావించారు. అక్కడి వసతులు చుట్టు పక్క గ్రామాలకు పాకడంతో భక్తుల సంఖ్య పెరిగింది. దినదినం స్వామి అమ్మవార్లకు ఆదరణ పెరుగుతోంది. నిత్యం పూజా కైంకర్యాలు, ధూపదీప నైవేద్యాలతో స్వామి అమ్మవార్లకు పూర్వ వైభవం నెలకొంది.

ఆలయానికి చేరుకోవడం ఇలా..

దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకోవలంటే మండల కేంద్రం రుద్రవరం నుంచి అటవీ కార్యాలయం దారిలో నేరుగా వెళ్లవచ్చు. దొర్వి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి మరి కొద్ది దూరం ముందుకెళ్తే గుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి చేరుకోవచ్చు. ఆ ఆలయాల పరిసరాల్లోనే గండ్లేరు జలాశయం, నల్లమల అటవీ ప్రాంతం ఉంది.


పూజలందుకుంటున్న దొర్వి లక్ష్మీనరసింహస్వామి

దాతల సహకారంతో..



లక్ష్మీనరసింహస్వామి మా ఇంటి ఇలవేల్పు. ఏ చిన్న శుభకార్యమైనా స్వామివారి సన్నిధిలోనే చేసుకునేవాళ్లం. అయితే గతంలో మేము ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం బండలు, రంగులు వంటివి ఇంటికి అవసరమైన వస్తువులు విక్రయించే వ్యాపారం చేస్తూ కాస్త ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. దీంతో దీనస్థితిలో ఉన్న ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టాం. స్టాంప్ రైటర్ నరసింహ, రుద్దిరెడ్డి నరసింహుడు, అన్నదాత ఓబులయ్య, వరద దస్తగిరి, సాకలి నరసింహుడు, పోల్‌దాస్ పెద్ద లక్ష్మీనరసయ్య, మొల్క ప్రసాద్ తోడుగా నిలిచారు. అందరం కలిసి పనులు పూర్తి చేశాం. మాతో పాటు దాతల సహకారం లభించడంతో ఆలయం వద్ద వసతులన్నీ సమకూర్చాం. ఇంకా చేయాల్సి పనులు ఉన్నాయి. దాతల సహకారంతో వాటిని కూడా పూర్తి చేస్తాం. – బండల శీను, నిత్య సేవకుడు

‘చైతన్య’ దోపిడీని అరికట్టాలి


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): శ్రీచైతన్య విద్యాసంస్థల ఆర్థిక దోపిడీని అరికట్టాలని, పాఠ్యపుస్తకాలను అమ్మడం నేరమన్న నాయకులపై పోలీసులతో దాడి చేయడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ పేర్కొన్నారు. విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో ఉండే శ్రీ చైతన్య విద్యాసంస్థలో పాఠ్య పుస్తకాలను అమ్ముతూ దోపిడీకి పాల్పడుతున్నారని, ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించి డీఈఓకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా నాయకులు శశిధర్‌రెడ్డి, ధనుష్, అస్లాం, రోహిత్ విష్ణు, అరుణ్, వెంకి పాల్గొన్నారు.

అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్

శిరివెళ్ల: అటవీ సంపద సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ అనురాగమీనన్ అన్నారు. గురువారం పచ్చర్ల ఎకో టూరిజంలో అటవీ సిబ్బందికి అటవీ సంరక్షణపై రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972లో వన్య ప్రాణుల సంరక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. వన్య ప్రాణులను వేటాడినా, చంపినా ఏడేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా ఉందన్నారు. నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో వన్య మృగాల వేట నిషేధమన్నారు. వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చినప్పుడు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పులులు, జింకలు, చిరుతలను కాపాడాలని సిబ్బందికి సూచించారు. 1967లోనే అటవీ సంపద రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. అభయారణ్యంలోకి ఎవరైనా చొరబడి చెట్లు నరకడం, తరలించడం చేస్తే శిక్షార్హులవుతారన్నారు. అనంతరం చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో తిన్‌మోళి నేతృత్వంలో నిపుణులు వన్యప్రాణులు, అటవీ సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల, ఆత్మకూరు, మార్కాపురం డీఎఫ్‌ఓలు సాయిబాబా, సందీప్ కుమార్ గుండాలి, నాగమనేశ్వరి, ఎఫ్ఆర్ఓ ఉదయ్‌దీప్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాటం సంఘం నాయకులు గురువారం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈనెల 16న ఆదోనిలో అధికారికంగా జరిగిన కార్యక్రమంలో ఎస్సీ సర్పంచ్ చంద్రశేఖర్‌ను వేదికపైకి పిలవకుండా అవమానించిన ఆదోని ఎమ్మెల్యేపైన, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నాయకులు మనోహర్, మధు, కల్యాణ్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు చరణ్, కొండయ్య, జగన్, చైతన్య, చరణ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి..

దళితులను చిన్న చూపు చూడటం ఆదోని ఎమ్మెల్యేకు తగదని, ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహ, గౌస్, వెంకటలింగం డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలనలో దళితులపై వివక్ష చూపుతోందని ఆరోపించారు.

ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారధిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్‌డీపీఐ అసెంబ్లీ నాయకులు రిజ్వాన్ ఆలం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 16న జరిగిన కార్యక్రమంలో ధనాపురం గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌ను టీడీపీ నేత గుడిసె కిష్టమ్మతో కలిసి కులం పేరుతో అవమానించడం కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. దీనిపై చర్యలు చేపట్టాలని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మజీద్‌ఖాన్, ఎజాస్‌హుసేన్, కరీముల్లా, సుల్తాన్, సోహెల్ పాల్గొన్నారు.


మాయలూరు గ్రామ సచివాలయం ఎదుట నిలిచిన మురుగు నీరు

మురుగు.. తొలగింపు దేవుడెరుగు!

ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామ సచివాలయానికి ఎదురుగా, బీసీ కాలనీ చుట్టూ మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కార్యాలయానికి వచ్చే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉచిత సలహాలిచ్చే అధికారులు.. తమ కార్యాలయం సమీపంలో ఉన్న పరిసరాల పరిశుభ్రతను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సచివాలయం సమీపంలో వర్షపు నీరు, వృథా నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక నిలిచి పోవడంతో కంప చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. రాత్రి వేళల్లో విష సర్పాలు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

– ఉయ్యాలవాడ

ఇంటి స్థలం ఇచ్చే వరకు పోరాటం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం ఇచ్చే వరకు పోరాటం ఆగదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో భూమిని శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో నాలుగు దఫాలుగా అర్జీ దారులతో ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. సర్కారు వెంటనే చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సరస్వతి, నారాయణమ్మ, హబీబ్, మద్దిలేటి, మద్దయ్య, సుబ్బరాయుడు, దానం పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పాఠశాలల్లోనే పుస్తకాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమైన వెంటనే పుస్తకాల విక్రయ కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసులు (47) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దకొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకుంటున్నా ఆరోగ్యం కుదుటపడటం లేదని గురువారం తన స్వగృహంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, జేసీ

నంద్యాల: ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ టెక్కే మార్కెట్ యార్డులో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లతో యోగాంధ్ర సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ టెక్కె మార్కెట్ యార్డులో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి పెండింగ్ ఉన్న యోగా వేదికలను సాయంత్రం నాటికి పూర్తి చేయాలన్నారు. యోగా ప్రదేశాలకు ఉదయం 6.15 గంటలకు ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని క్లీన్ మైండ్.. క్లీన్ బాడీ అనే థీమ్‌తో నిర్వహిస్తామన్నారు.


మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ


యోగా చేస్తున్న విద్యార్థులు అధికారులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

శిరివెళ్ల: ప్రతి రోజూ కొంత సమయం కేటాయించుకుని యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని డీఎం అండ్ హెచ్ఓ వెంకటరమణ సూచించారు. గురువారం నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల ఎకో టూరిజం ఆవరణంలో మెగా యోగా కార్యక్రమం నిర్వహించారు. మహానంది సత్యసాయి మండలి గురూజీ యోగాసనాలు వేయించారు. అనంతరం డీఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ నిత్య జీవితంలో ఒత్తిళ్ల నుంచి ఉపశమన కోసం ప్రతి రోజు ఉదయాన్నే యోగా చేయాలన్నారు. యోగాపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, పుణ్య క్షేత్రాల్లో మెగా యోగా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖ పట్టణంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, ఉపాధి పథకం పీడీ సూర్యనారాయణ, డీఎఫ్ఓ నాగమనేశ్వరి, ఐసీడీఎస్ సీడీపీఓ తేజస్విని, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ జయశ్రీ పాల్గొన్నారు.

కార్మికుల గోడు పట్టదా?

- సమస్యలు పరిష్కరించాలంటున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు
- 40 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- హామీ ఇచ్చి ముఖం చాటేసిన ఉపముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్


ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని గత నెల 7వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. 40 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నంద్యాల మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో 1300 మంది టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరంతా విద్యుత్, తాగునీటి సరఫరా, తాగునీటి పథకాల నిర్వహణ తదితర పనులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.13 వేలు వేతనం చెల్లిస్తుంది. అయితే చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని, ఉద్యోగ భద్రత,ఇతర సదుపాయాలు కూడా లేవని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వారాహి యాత్రకు వచ్చిన పవన్ కల్యాణ్, యువగళంలో నారా లోకేష్‌కు తమ సమస్యలు విన్నవించగా, అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు కనీసం పట్టించుకోకపోవడం సరికాదంటున్నారు. ఏడు సంవత్సరాలుగా ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచలేదని, సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ నాయకులు పేర్కొంటున్నారు.

కార్మికుల డిమాండ్లు..

- కార్మిక చట్టాల ప్రకారం ఇంజినీరింగ్ వర్కర్లకు రూ.29,200, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 చొప్పున జీతాలు చెల్లించాలి.
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు, 15 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలి.
- ప్రభుత్వం ప్రకటించిన 55 ఆదివారాలు, 17 దేశ, జాతీయ, రాష్ట్ర పండగ రోజుల్లో సెలవు ఇవ్వాలి. లేదా ఆ రోజులకు వేతనాలు చెల్లించాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10లక్షలు, ఆంగవైకల్యం పొందిన వారికి రూ. 5 లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలి.
- విధుల్లో అనారోగ్యం బారిన పడి, శరీరం సహకరించని వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వమే వైద్యసేవలందించాలి. కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి.
- కార్మికులకు సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.
- పదవీ విరమణ తర్వాత ఇతర ప్రభుత్వ ఉద్యోగుల్లాగే చెల్లింపులు చేపట్టాలి.

శ్రమ దోపిడీకి గురవుతున్నాం



మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ సిబ్బంది శ్రమదోపిడీకి గురవతున్నారు. అన్ని అత్యవసర విభాగాల్లోనూ సేవలందిస్తున్నాం. పనికితగ్గ వేతనం అందించడం లేదు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదు. నాడు పరిష్కరిస్తామని హామీనిచ్చిన పవన్ కల్యాణ్, లోకేష్ ఇప్పుడు నోరు మెదపకపోవడం దారుణం. 40 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది.

–దుర్గా, నంద్యాల జిల్లా మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు